క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడ టౌన్: విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ సోమవారం ఆవిష్కరించారు. స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈ క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు వసుధ బసవేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పీబీఎస్ఆర్ ప్రసాదు, వీవీ రాఘవాచార్యులు, కృష్ణకిషోర్, నవీన్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు



గుడివాడ టౌన్(నందివాడ): ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు నందివాడ ఎస్సై శిరీష తెలిపారు. నందివాడ మండలం కుదరవల్లి గ్రామం ఏలూరు జిల్లాకు సరిహద్దు కావడంతో బుడమేరు వంతెన వద్ద పోలీసుల నిఘాలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 24 గంటలు ఈ చెక్ పోస్టులో తనిఖీలు ఉంటాయని అనుమతులు లేకుండా మద్యం, డబ్బు ఇతర నిషేధిత వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు వసంతుల కృష్ణ, గుజ్జుల లాజరు పాల్గొన్నారు.

2న గ్రూప్-2 అభ్యర్థులకు అవగాహన

గుడివాడ టౌన్: గ్రూప్-2 పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థుల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి నీలం ప్రభాకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి రెండో తేదీ స్థానిక గౌరీశంకరపురంలోని (విద్యావికాస్ ఎదురుగా) అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం ఐదు గంటలకు రెండు సబ్జెక్ట్‌లపై అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు భారత ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల చరిత్ర, భారత సమాజం అనే అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అనుమతి లేని ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించాలి

మండవల్లి: రహదారుల వెంట కుప్పలు తెప్పలుగా ఏర్పాటు చేసిన అనుమతి లేని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని ఐక్య వేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన'లో తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

పోస్టాఫీస్‌కు స్థలం కేటాయించాలి

మండవల్లి: మండవల్లిలో పోస్టాఫీస్‌కు స్థలం కేటాయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ, స్థానిక మంచినీటి చెరువు వద్ద పోస్టాఫీస్ భవన నిర్మాణానికి పోలీస్ స్టేషన్ పక్కన 10 సెంట్లు స్థలం కేటాయించింది. రోడ్డు విస్తరణ కార్యక్రమంలో ఆ స్థలం పూర్తిగా పోయింది. ప్రస్తుతం పోస్టాఫీస్ స్థానిక స్టేషన్‌రోడ్‌లో గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇందులో ఉన్న చాలీచాలని ఇరుకు గదులతో పోస్టాఫీస్ సిబ్బందితో, పాటు లావాదేవీలు జరుపడానికి వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టాఫీస్‌లో ఎలాంటి పనిబడినా అక్కడ లావాదేవీలు జరపాలంటే నిలబడేందుకు జాగా లేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని వాపోతున్నారు. మండవల్లి మండలానికి 29 గ్రామాలు ఉన్నాయి. మండల వాసులు ఎంఓ చేయడానికి, చిన్న కార్డు కొనడానికి కూడా పోస్టాఫీస్‌కు రావాల్సి ఉంటుంది. ఇప్పటికైనా పోస్టాఫీస్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



కలిదిండి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) పనితీరుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఈవీఎంల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వంశీ తెలిపారు. ఎస్సార్పీ అగ్రహారం, కలిదిండి, పడమటిపాలెం, సానారుద్రవరం గ్రామాలలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, పారదర్శకతపై అవగాహన కల్పించేందుకు ఈవీఎంల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లు ఈవీఎంల పనితీరును తెలుసుకోవాలన్నారు.

కైకలూరు అభివృద్ధికి విశేష కృషి

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



పెదపాలపర్రులో సీసీ రోడ్లకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతో కైకలూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. మండలంలోని పెదపాలపర్రులో రూ.24 లక్షలు, కోడూరులో రూ.31 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం నిధులతో పూర్తిచేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో నియోజకవర్గం పూర్తి నిర్లక్ష్యానికి గురై అన్నిరంగాల్లో వెనుకబడినట్లు చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టాన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య, గ్రామాల్లో అంతర్గత రోడ్ల సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఆక్వా రైతులకు విద్యుత్ వినియోగంపై సబ్సిడీ ఇవ్వాలని మొదటి తానే ప్రతిపాదించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ప్రస్తుతం విద్యుత్ సబ్సిడీ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలన్నింటినీ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 15 వేల మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోటేశ్వరరావు, విష్ణు, శేషుబాబు, నాగదుర్గ, వెంకటేశ్వరరావు, సుధాకరరెడ్డి, సాక్షి సాయిబాబు, వల్లభనేని శేషుబాబు, వెంకటరాజు, వెంకయ్య, పెదపాలపర్రు సొసైటీ అధ్యక్షుడు బొప్పన ప్రసాద్ పాల్గొన్నారు.



పెదపాలపర్రులో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న ఆర్డీఓ పద్మావతి



క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న గొర్ల శ్రీను

గుడివాడరూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక కైకాల కళామందిరంలో నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ముగింపు సభలో సోమవారం ఆమె విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువత కూడా క్రీడా రంగాల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాలనే ఉద్దేశంతోనే ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. మండలస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు నియోజకవర్గస్థాయి పోటీల్లో నిర్వహించి విజయం సాధించిన వారిని జిల్లా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను మాట్లాడుతూ క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. బ్యాడ్మింటన్ పోటీల్లో గుడివాడ మహిళా జట్టు విజయం సాధించింది. ఫైనల్ పోటీలకు అర్హత సాధించిన టీం రాకపోవడంతో రిఫరీలు గుడివాడ మహిళా జట్టును విజేతగా ప్రకటించారు. అదేవిధంగా ఖోఖో పోటీల్లో గుడివాడ మహిళా జట్టు విన్నర్ కాగా గుడ్లవల్లేరు రన్నర్‌గా నిలిచింది. క్రికెట్‌లో గుడివాడ జట్టు విజేతగా నిలవగా నందివాడ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ఆర్డీఓ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షీల్డ్, గోల్డ్‌మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో కైకలూరు నంబర్ ఒన్

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు గ్రీన్ విలేజ్‌లో ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జిల్లా గృహ నిర్మాణాలలో కైకలూరు నియోజకవర్గం నంబర్ ఒన్ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ఏలూరు రోడ్ వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో కైకలూరు మండలానికి సంబంధించి 179, మండవల్లి మండలానికి చెందిన 41 మంది వెరసి 220 మంది మహిళలకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యే సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు 12 వేల ఇంటి పట్టాలను పంపిణీ చేశామన్నారు. కైకలూరు గ్రీన్ విలేజ్‌లో మూడు వేల మందికి పట్టాల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే గ్రీన్ విలేజ్‌లో నిర్వాసితులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. విద్యుత్, తాగునీరు, రహదారులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రేటర్ కమ్యూనిటీ తరహాలో సౌకర్యాలు కల్పించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బి.నాగరాజు, కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ముస్లిం మైనారిటీ జిల్లా కార్యదర్శి షేక్ రఫీ, నాయకులు బావిశెట్టి నాగేశ్వరరావు, వేండ్రం నాగరాజు, దారం రమేష్, కన్నా రమేష్, తోట మహేష్, తలారి సత్యనారాయణ, ముక్కెళ్ళ పెద్దిరాజులు, చొప్పాల రాము పాల్గొన్నారు.

అన్నదానం



చిన్నారులకు అన్నదానం చేస్తున్న దాత ఆరుమళ్ల వంశీ

పామర్రు: గ్రామంలోని ఎబినైజర్ శాంతి నికేతన్ పిల్లల సంస్థలోని చిన్నారులకు దాత సహకారంతో అన్నదానం సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు నాయకుడు ఆరుమళ్ల వంశీ వెంకటరామిరెడ్డి వితరణతో చిన్నారులకు అన్నదానం చేశారు. దాత మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని, స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మళ్లీ విజయంసాధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆకాంక్షిస్తూ సంస్థలోని చిన్నారులకు అన్నదానం నిర్వహించామన్నారు. తదుపరి సంస్థ నిర్వాహకులు ఎబినైజర్ వైఎస్సార్ సీపీ నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణా మిల్క్‌యూనియన్ ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీటీసీటీ సభ్యుడు శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఆర్బీకే మండల కన్వీనర్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, దేవిరెడ్డి భాస్కరరెడ్డి, మర్రెడ్డి అంజిరెడ్డి, చిన్నం శ్రీనివాసరావు, మద్దుల సుబ్రమణ్యం, ఏ శ్రీహరి, శేషురెడ్డి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి, చాట్ల హనుమంతు, నత్తా నాని, కూరపాటి చిన్న, నందిపునాంచారయ్య, కాకి ప్రవీణ్, దక్షణామూర్తి, కానోళ్ల కిషోర్, ఎండీ జమీల్ పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి కీర్తనలు



బృందగానం చేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని వివేకానంద మందిరంలో సోమవారం శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ త్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయనీమణులు చేసిన బృందగానం శ్రోతలను అలరించాయి. లత, కిరణ్మయి, పావని, లీలా కామేశ్వరి, శ్రావ్య, ప్రవల్లిక, శిరీష, శ్యామల, కళ్యాణి, ప్రవీణ, శృతి ఆలపించిన బృందగానాలు ఆకట్టుకున్నాయి. వీరికి వీణపై వాయిద్యా సహకారాన్ని లలిత అందించారు. పలువురు గాయనీమణులు చేసిన బృందగానాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను త్యాగరాజ సంగీత విద్యాపీఠం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి కల్యాణి, కోశాధికారి లక్ష్మీకాంత్, నిర్వాహక కార్యదర్శి ఉమా పర్యవేక్షించారు.

సేవాభావంతో పనిచేయాలి



ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులు పార్టీ పటిష్టత కోసం సేవాభావంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా కోటేశ్వరరావు, సంధ్య దంపతులు గ్రామంలోని వృద్ధులకు 100 దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ శ్రేణులు కోటేశ్వరరావు దంపతులను ఆదర్శంగా తీసుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.4.6 లక్షలు

పామర్రు: ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయ హుండీలోని కానుకల లెక్కింపులో రూ.4.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. సోమవారం ఆలయంలో జరిగిన కానుకల లెక్కింపును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయంలోని హుండీలలో భక్తులు 68 రోజుల పాటు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం యనమలకుదురు కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు పర్యవేక్షణలో కానుకలు లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి



గుడివాడరూరల్: గుడివాడ ఆటోనగర్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ఆటోనగర్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు సహకరించాలని గుడివాడ టూటౌన్ సీఐ ఎంఎస్ దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక ఆటోనగర్‌లో సోమవారం సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన ఆటోనగర్ అసోసియేషన్ సభ్యులతో శాంతిభద్రత పరిరక్షణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోనగర్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసుశాఖ అన్ని చర్యలు చేపడుతోందన్నారు. దీనికి అసోసియేషన్ సభ్యులతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించాలన్నారు. గుడివాడ పట్టణానికి తలమానికంగా ఉన్న ఆటోనగర్‌లో ఎటువంటి ఘర్షణలు, జూదాలు నిర్వహించకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు చేపడతారని తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి



ప్రధానమంత్రి మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

కలిదిండి: విద్యార్థులపై తోటి స్నేహితులు, తల్లిదండ్రుల కారణంగా ఒత్తిళ్లు ఉంటాయని వాటిని అధిగమించి రాణించాలని ఎంఈఓ పి.ప్రభాకర్‌రావు అన్నారు. ప్రధానమంత్రి మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని కలిదిండి, సానా రుద్రవరం, కొండంగి, కోరుకొల్లు, గుర్వాయపాలెం, ఆరుతెగలపాడు తదితర గ్రామాల్లోని పాఠశాలలో సోమవారం నిర్వహించారు. కొన్నిసార్లు విద్యార్థులు ఒత్తిడికి లోనై తమ స్థాయికి తగ్గట్టు రాణించలేకపోతున్నారని, ప్రిపరేషన్ సమయంలో చిన్న లక్ష్యాలను ఏర్పరచుకుని, క్రమంగా పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. తద్వారా పరీక్షలు బాగా రాయగలరని, విద్యార్థులే దేశ భవిష్యత్తు రూపకర్తలు అని మోదీ విద్యార్థులకు వివరించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు 'స్పందన'

ఆర్డీఓ పద్మావతి



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి తక్షణ పరిష్కారానికి స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. నందివాడ మండలం తమిరిశ గ్రామానికి చెందిన జి అజాద్‌కుమార్ తన పొలానికి సంబంధించిన సమస్య పరిష్కారం కాలేదు తక్షణమే పరిష్కరించాలని దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం గ్రామానికి చెందిన ఎం.సుజాత తన ఇంటి స్థలం విషయంలో ఏర్పడిన సమస్యను వివరించారని ఆమె సమస్యను పరిష్కరించవలసిందిగా గ్రామ కార్యదర్శికి సూచించినట్లు ఆర్డీఓ తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. 11వ వార్డుకు చెందిన ఎం.విశ్వేశ్వరరావు తమ వార్డులో బీరువాల తయారీ రోడ్లపై చేస్తూ ప్రయాణికులకు అడ్డంకి కలిగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. 10వ వార్డుకు చెందిన మీర్ సదస్ అలి, 12వ వార్డుకు చెందిన బీబీ అమీనా జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇప్పించాలని తమకు అర్హత ఉందని అర్జీ ఇచ్చారు. 23వ వార్డుకు చెందిన అన్నం వెంకట సూర్యనారాయణ తమ సమీపంలోని మురుగుకాల్వ పూడుకుపోయి రోడ్‌పై మురుగునీరు ప్రవహిస్తుందని దానిని బాగు చేయాలంటూ ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: రానున్న వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిర్వహణకు గ్రామంలో జల సంఘం కమ్యూనిటీ కాంట్రాక్టు వ్యవస్థలో పనులు నిర్వహించాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య సిబ్బంది ఆధ్వర్యంలో మిషన్ పనులు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులకు కూడా కమిటీలలో చేర్పించుకుని పనులు సత్వరమే జరిగేలా చూడాలన్నారు. ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టే విధంగా అందరూ కలిసి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న ఎంపీపీ రాజామణి

తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, ఉపాధిహామీ, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్, డ్రెయినేజీ, హౌసింగ్, తదితర శాఖలపై ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సమీక్ష జరిపారు. శాఖల వారీగా తాము చేస్తున్న కార్యక్రమాలపై అధికారులు ప్రగతి వివరాలను సభ్యులకు తెలియజేశారు. వివిధ సమస్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు. గురివిందపల్లి సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్ గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం పూర్తి కాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవీకాలం పూర్తి కావస్తున్నా భవన నిర్మాణం ఎప్పుడు చేస్తారంటూ ప్రశ్నించారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ ఎం. కుసుమకుమారి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కటా విభాగంలో సత్తాచాటిన కోసూరు విద్యార్థులు



మెడల్స్ సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, కోచ్

కోసూరు(మొవ్వ): సాయి బాబా అండ్ ఎస్‌కే మౌలానా మెమోరియల్ ట్రస్ట్ శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన 6వ ఇంటర్ స్టేట్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ ట్రోఫీ 2024లో తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు విజయ శ్రీ సన్‌ఫ్లవర్ హెచ్‌ఎం పి.జోషఫ్ థాయస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీమ్‌లో మొవ్వ మండలం కోసూరు గ్రామానికి చెందిన తమ పాఠశాల విద్యార్థులు కటా విభాగంలో దగాని తనుష్ రామ్, రాజులపాటి సూర్యతేజ, వలువర్తి ధనుష్ గోల్డ్ మెడల్స్, పెనుమూడి గౌరీ నందన్, బల్ల శ్రావ్య, చింతా రోహిత్ రాజ్‌లు బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను, కోచ్ డి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

4న బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



వరహాపట్నం సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహం

కైకలూరు: రాచపట్నం గ్రామ దళితులు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఫిబ్రవరి 4న ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో నత్తా రామేశ్వరంలో ఏడు అడుగుల ఎత్తులో కుర్చీలో ఆసీనులైన అంబేడ్కర్ విగ్రహాన్ని తయారు చేయించారు. ఈ విగ్రహాన్ని రాచపట్నం నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు గోట్రూ పాట్రిక్‌పాల్, రాచపట్నం అంబేడ్కర్ కమిటీ సోమవారం తెలిపారు. అనేక సంవత్సరాలుగా అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. ఎమ్మెల్యే డీఎన్నార్ చొరవతో రాచపట్నం ప్రజల కల నెరవేరింది. విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే డీఎన్నార్‌తోపాటు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ హాజరవుతారని పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కైకలూరు: ఎన్నికల నేపథ్యంలో కైకలూరు రూరల్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ సోమవారం పరిశీలించారు. పల్లెవాడ, ఆలపాడు, సోమేశ్వరం, దొడ్డిపట్ల, భుజబలపట్నం, శీతనపల్లి, వరహాపట్నం, రామవరం గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు బూత్‌ల పరిశీలించినట్లు పేర్కొన్నారు.